
చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్








ఎగిరే కారు కథ

చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్


ఇయాన్ ఫ్లెమింగ్

జెరమీ పాట్, అతడి చెల్లెలు జెమీమా వంటింటిలో ఉన్నారు.
వాళ్ల అమ్మ శ్రీమతి పాట్ పకోడీలు వేస్తోంది.
వాళ్లకి బయట ఏదో చప్పుడు వినిపించింది.
అదేమిటో చూద్దామని పిల్లలు బయటకి పరిగెత్తారు.




ఒక పెద్ద కారు చేస్తున్న శబ్దం అది.
అందులో వాళ్ల నాన్న ఉన్నాడు.

“పాత కారులలో నాకు ఇది దొరికింది,”
పాట్ చెప్పాడు. “అందరూ ఎక్కండి!
అలా తిరిగి వద్దాం.”




కారులో అనేక రకాల బటన్లు ఉన్నాయి.
అనేక లైట్లు కూడా ఉన్నాయి.
'స్టార్టర్' అన్న బటన్‌ని పాట్ నొక్కాడు.
ఇంజిన్ శబ్దం చెయ్యసాగింది.
ఆ శబ్దం 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' లాగా
అనిపిస్తోంది.

"ఈ కారుకి ఇదే పేరు పెడదాం,"
జెరమీ అన్నాడు. "దీనిని 'చిటి చిటి బ్యాంగ్
బ్యాంగ్' అని పిలుద్దాం."





కారుని పాట్ ప్రధాన రహదారిలోకి పోనిచ్చాడు.
కొంత సేపటికి ‘చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్’
వంద మైళ్ల వేగంతో వెళ్లసాగింది.

“మనం ఎక్కడికి వెళుతున్నాం?” శ్రీమతి పాట్
అడిగింది.
“సముద్ర తీరానికి,” పాట్ బదులిచ్చాడు.
“అక్కడ పిక్‌నిక్ చేసుకుందాం.”



కానీ, అందరూ సముద్ర తీరానికే వెళుతున్నారు.
దాంతో పాట్ వాళ్ల కారు ముందుకు వెళ్లటం లేదు.
“పిక్‌నిక్‌కి ఇది అంత మంచి చోటు కాదు,”
శ్రీమతి పాట్ అంది.
“కారులోనే సమయం అంతా గడిచేటట్టు ఉంది,”
పాట్ అన్నాడు.





అంతలో కారులో ఒక బటన్ వెలగసాగింది!
దాని మీద ఇలా రాసి ఉంది-




"దీనిని నొక్కితే ఏం జరుగుతుందో
చూద్దాం," జెరమీ అన్నాడు.
ఆ బటన్‌ని పాట్ నొక్కాడు.




దాంతో ఇంజిను విచిత్ర శబ్దం చేసింది.
కారు అటూ, ఇటూ ఊగింది.
తరవాత విమానానికి లాగా కారుకి రెండు రెక్కలు
బయటకు వచ్చాయి!
"ఇదేదో మాయ లాగా ఉంది!" జెమీమా అరిచింది.



"అవును, మాయ లాగానే ఉంది," నాన్న అన్నాడు.
రోడ్డు మీద నుంచి 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' పైకి
లేచి గాలిలో ఎగరసాగింది.




ముందున్న అన్ని కారుల మీద నుంచి
అది ఎగరసాగింది.
ఆకాశంలో ఒక పక్షి లాగా అది
ఎగురుతోంది.
సముద్ర తీరం వైపు అది వెళుతోంది.



‘చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్’
సముద్ర తీరాన్ని చేరుకుంది. కానీ
తీరం వద్ద అంతటా జనమే.
“మనం పిక్‌నిక్ ఎక్కడ
చేసుకోవాలి?” అమ్మ అడిగింది.
“ఇక్కడ కిందకి దిగటానికి కూడా
చోటు లేదు.”

అంతలో నాన్న చేతిలోని స్టీరింగ్
చక్రం దానంతట అది తిరిగింది.
ఎవరూ నడపకుండానే కారు
వెళుతోంది!



'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్'
సముద్ర తీరం నుంచి దూరం వెళ్ల
సాగింది.
అది నేలను దాటుకుని సముద్రం మీద
వెళ్లసాగింది.


కొంచెం సేపు తరవాత అది కిందకి, నేరుగా
అలలలోకి దూసుకుని వెళుతున్నట్టు అనిపించింది
"మనం సముద్రంలో పడిపోతాం!"
అమ్మ అరిచింది. "మనం తడిసిపోతాం."



అయితే, 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' అలలను ఢీకొట్ట లేదు. అది రెక్కలను లోపలికి ముడుచుకుని సముద్రం మీద దిగింది.

తరవాత అది సముద్ర తీరం వైపు వెళ్లింది..


"ఫ్రాన్స్‌కి వచ్చినట్టున్నాం," జెరమీ అన్నాడు. "చూడండి, ఆ దీప స్తంభం మీద ఫ్రాన్స్ జెండా ఉంది."




“ఇక్కడ ఎవ్వరూ లేరు,” అమ్మ అంది.
“ఇక్కడ ప్రశాంతంగా పిక్‌నిక్ జరుపుకోవచ్చు.”
పిక్‌నిక్ సామానంతా బయటకు తీశారు.
ఇసక మీద ఒక దుప్పటి పరిచారు.



“ఇక్కడ ఒక గుహ ఉంది,” జెరమీ అరుస్తూ
చెప్పాడు.
జెమీమాతో కలిసి అతడు గుహ లోపలికి
పరిగెత్తాడు. గుహ లోపల చీకటిగా ఉంది,
భయ పెట్టేలా ఉంది.






“అటు చూడు!” జెమీమా అరిచింది.
ఎదురుగా ఒక అస్థిపంజరం ఉంది.
అది ముందుకీ, వెనక్కీ ఊగుతోంది. దాని
ఎముకలు శబ్దాలు చేస్తున్నాయి. భయంతో
జెమీమా పెద్దగా అరిచింది.

ఆ అరుపులు విన్న అమ్మా, నాన్నలు ‘చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్’ని లోపలికి తీసుకుని వచ్చారు.




“మనల్ని భయ పెట్టటానికి ఈ ఉత్తుత్తి అస్థి పంజరాన్ని ఇక్కడ పెట్టారు. ఈ గుహ లోపలికి ఎవరూ వెళ్లకూడదని ఎవరో కోరుకుంటున్నారు. కానీ, మనం లోపలికి వెళదాం,” నాన్న చెప్పాడు.





చీకటిగా, భయం కొలుపుతూ ఉన్న
గుహ లోపలికి వాళ్లు వెళుతున్నారు.
వాళ్ల తలల పైనుంచి గబ్బిలాలు
తిరుగుతున్నాయి.
పైనుంచి నీటి బొట్లు కారుతున్నా . పాములు,
సాలీళ్లు యదేచ్ఛగా తిరుగుతున్నాయి.
“ఆ పైన ఉన్నది ఏమిటి?” జెరమీ అరిచాడు.

అక్కడ ఒక పెద్ద గది ఉంది. దాని నిండా తుపాకులు ఉన్నాయి. పెట్టెల నిండా బాంబులు, పీపాల నిండా మందు గుండు ఉన్నాయి. “చాలా వింతగా ఉందే,” నాన్న అన్నాడు.



అక్కడ, గోడకి పిన్నులతో పెట్టిన ఒక హెచ్చరిక కనిపించింది. వాళ్లు దగ్గరకు వెళ్లి దానిని చదివారు



"భయంకర్ జో గురించి నేను పత్రికలలో చదివాను. అతడు పెద్ద దొంగ!" జెరమీ అన్నాడు. "ఇది అతడి రహస్య స్థావరం లాగా ఉంది," జెమీమా అంది.




"వీటన్నిటినీ పేల్చేద్దాం పదండి," జెరమీ అన్నాడు. "మంచి ఆలోచన," అమ్మ అంది. "తరవాత మనం పిక్నిక్ చేసుకోవచ్చు."

జానకి తాడు ఒక వైపుని నాన్న మందు గుండు ఉన్న పీపాలో పెట్టాడు. రెండవ వైపు నిప్పు ముట్టించాడు. తరవాత, "వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి," అన్నాడు.




వాళ్లు గుహ లోంచి బయటకు
వచ్చారో, లేదో,
'ధడామ్! ధడామ్!!'
అంటూ గుహలోని వస్తువులన్నీ
పేలిపోయాయి.



అదే సమయానికి అక్కడికి ఒక పెద్ద, నల్ల కారు వచ్చింది.
దాంట్లోంచి ముగ్గురు మనుషులు బయటకు దూకారు.
వాళ్లు తమ తుపాకులను పాట్ కుటుంబ సభ్యుల వైపు
గురిపెట్టారు.
"చేతులు పైకి ఎత్తండి," వాళ్లల్లో ఒకడు అరిచాడు.

"అతడే భయంకర్ జో," జెరమీ అన్నాడు.
"నేను దినపత్రికలలో అతడి ఫొటో చూశాను."



"పెద్ద వాళ్ల చేతులు కట్టెయ్యండి,"
భయంకర్ జో అన్నాడు. అతడి సహచరులు
అమ్మా, నాన్నలను తాళ్లతో గట్టిగా కట్టేశారు.




జెరమీ, జెమీమాలను పెద్ద, నల్ల కారులోకి జో
నెట్టాడు.
"ఈ పిల్లలను మనం పారిస్ తీసుకుని
వెళదాం," అతను అన్నాడు. "డబ్బులు
ఇచ్చినప్పుడు వీళ్లని వదిలిపెడదాం."



అమ్మా, నాన్నలు లేచి కూర్చున్నారు. కానీ, వాళ్లు తమ కట్లను విప్పుకోలేక పోయారు. అక్కడి నుంచి వెళ్లిపోతున్న పెద్ద, నల్ల కారును వాళ్లు చూస్తూ ఉండిపోయారు.




జెరమీ, జమీమాలు కూడా పెద్ద, నల్ల కారు లోంచి చూస్తూ ఉండిపోయా . జెమీమా ఏడవసాగింది. “అమ్మా, నాన్నలను మళ్లీ చూస్తామా,” అంటూ ఆమె ఏడ్చింది.




అప్పుడు 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' దగ్గింది. అది అటూ, ఇటూ కదిలింది. బడబడమంటూ చప్పుళ్లు చెయ్యసాగింది.

తరవాత అది శ్రీమతి పాట్‌ని ఎత్తి సీటులో కూర్చోబెట్టింది. పాట్‌ని కూడా కారులోకి ఎక్కించింది.





తరవాత 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' పారిస్ వెళ్లే రోడ్డులో వెళ్లసాగింది. పాట్, శ్రీమతి పాట్‌ల చేతులు ఇంకా కట్టివేసే ఉన్నాయి.

కానీ 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్'
తనంతట తానే వెళుతోంది!
అది వంద మైళ్ల వేగంతో వెళుతోంది.
పెద్ద, నల్ల కారులోని భయంకర్ జో ని అది వెంబడిస్తోంది.




పారిస్ దగ్గర అవుతుండగా అది పెద్ద,
నల్ల కారుని అందుకుంది.






రెండు కార్లూ పారిస్ మధ్య లోంచి
వెళుతున్నాయి. నల్ల, పెద్ద కారుకి
చాలా దగ్గరకల్లా ‘చిటి చిటి బ్యాంగ్
బ్యాంగ్’ వచ్చేసింది. పెద్ద, నల్ల కారుని
అది కొరకసాగింది.

భయంకర్ జో, అతడి సహచరులు కారు
లోంచి బయటకు దూకి మొదటి అంతస్తు
లోని ఇంటిలోకి పరిగెత్తసాగా .



జెరమీ, జెమీమాలు 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్'
వైపు పరిగెతారు. నాన్న కట్లను జెరమీ, అమ్మ
కట్లను జెమీమా విప్పదీశారు.




భయంకర్ జో తుపాకీ పేల్చసాగాడు. కానీ, 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' తుపాకీ గుండ్లకు భయపడ లేదు. దడదడమెటూ అంటూ అది మెట్ల మీద నుంచి ఎక్కసాగింది. పాట్, జెరమీ దాని వెనక పరిగెత్తారు.

“నేను పోలీసులకు ఫోన్ చేస్తాను,” శ్రీమతి పాట్ అంది.

తలుపు లోంచి 'చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్' దూసుకుని వెళ్లింది. ఒక్కసారిగా ముందుకు దూకి భయంకర్ జో ని, అతడి సహచరులను గోడకి నొక్కి పెట్టింది.


గోడకి బాగా నొక్కటంతో వాళ్లు తుపా లను జారవిడవక తప్పలేదు. పోలీసులు వచ్చే వరకు వాళ్లను అలాగే నొక్కి పెట్టి ఉంచింది.



జో కి, అతడి సహచరులకి కలిపి పోలీసులు బేడీలు వేశారు. వాళ్లని జైలుకి తీసుకుని వెళ్లారు.




“జో ని పట్టించినందుకు ధన్యవాదాలు,” పోలీసు ముఖ్య అధికారి చెప్పాడు. “మీ కోసం ఏం చెయ్యమన్నారు?”
“మేం పిక్‌నిక్ చేసుకోటానికి మంచి చోటు ఏదో చెప్పండి,” శ్రీమతి పాట్ అంది. “నాకు బాగా ఆకలి వేస్తోంది!”




పోలీసు ముఖ్య అధికారి వాళ్లను అందమైన పార్కుకి తీసుకుని వెళ్లాడు. వాళ్లందరూ అక్కడ కూర్చుని వెంట తెచ్చుకున్నవి తినసాగారు.
“బ్రెడ్డు, వెన్నా మీకు నచ్చుతుంది,” పోలీసు ముఖ్య అధికారితో శ్రీమతి పాట్ అంది.





‘చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్’కి ఫ్రెంచి పోలీసులు పెట్రోలు తాగించారు. రేడియేటర్‌లో నీళ్లు పోశారు. శుభ్రంగా కడిగి, బాగా తుడిచారు. అది కొత్త కారు లాగా తళ తళా మెరిసిపోతోంది.



ఆ రాత్రికే పాట్ పరివారాన్ని తీసుకుని ‘చిటి చిటి బ్యాంగ్ బ్యాంగ్’ ఇంటికి బయలు దేరింది.

“ఇంటికి చేరుకున్నాక చాలా బాగుంటుంది,” జెమీమా అంది.

“అవును,” జెరమీ అన్నాడు. “కానీ, ఇంటికి వెళ్లే లోపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?”

